క్లుప్తంగా

నేత్రాలను సంరక్షించుకోవాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి

ఐరాల: నేత్రాలను ప్రతి ఒక్కరూ సంరక్షించుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి అన్నారు. మండలంలోని పుత్రమద్దిలో శుక్రవారం చిత్తూరు అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్, రీసెర్చ్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కన్వీనర్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు 150 మందికి కంటి పరీక్షలు, చర్మవ్యాధులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇందులో 41 మందికి కంటి ఆపరేషన్లకు జిల్లా ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అపోలో మేనేజర్ మాధవరెడ్డి, అపోలో పీఆర్‌ఓ కమురుద్దీన్, డాక్టర్లు మౌనిక, దర్శన్, రెడ్డితేజ, రసూల్, ఆలీ, భార్గవ్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కలశపూజ



కలశ పూజల్లో వేదపండితులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం ప్రశాంత్‌నగర్‌లోని శ్రీశాస్తగిరి అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం 109 కలశాలతో పూజలు శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామి వారికి అభిషేక పూజలు చేయించారు. తర్వాత 15 మంది శబరిమల వేదపండితులు వేదమంత్రాలు పఠిస్తూ కలశపూజలను భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు. రాత్రి శిలా ప్రతిష్ఠ పూజలను అత్యంత వైభవంగా చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

రైతులకు అందుబాటులో కందులు



రైతు భరోసా కేంద్రానికి చేరిన కందులు

గుడిపాల: రైతులకు అందుబాటులో కందులు ఉన్నట్లు వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాలకు కందులను ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. ఇప్పటికి 2400 కిలోల కందులు, రాగులు 72 కిలోలు, కొర్రలు 20 కిలోలు వచ్చాయని చెప్పారు. కందులను రైతులు ఖచ్చితంగా వేసి తీరాలని స్పష్టం చేశారు. రాగులు ఇంకా ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని వివరించారు. ఉచితంగా ఇచ్చే రాగులను రైతులు ఖచ్చితంగా సాగు చేయాల్సి ఉందన్నారు. తరువాత ప్రభుత్వమే రాగులు కిలో రూ.38 చొప్పున కొనుగోలు చేస్తుందని వివరించారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: మండలంలోని కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. ఆమె శుక్రవారం మండలంలోని ఎం.బండపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. పరిశీలించిన అనంతరం కూలీల వద్ద ఉపాధి పనుల విధివిధానాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రజలు పనులు లేక వలస పోకుండా సొంత గ్రామంలోనే పనులను ప్రభుత్వం కల్పిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హేమలత, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం ప్రసంగాన్ని వీక్షించిన ఎమ్మెల్యే



సీఎం ప్రసంగాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే ఎం.ఎస్ బాబు, తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి

తవణంపల్లె: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష పథకాన్ని శుక్రవారం ప్రారంభించిన, అనంతరం ప్రసంగాన్ని వీడియో ద్వారా ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు, తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, పార్టీ నాయకులు గాంధీబాబు, రమణారెడ్డి, మధుకుమార్, రవిప్రసాద్, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, గృహసారథులు వీక్షించారు.

ఐరాల మండలంలో పచ్చదనం- పరిశుభ్రతతో ఆహ్లాదకరంగా మారిన ప్రభుత్వ పాఠశాలల పరిసరాలు







'అమ్మ ఒడి'లాంటి సర్కారు బడి

- నాడు–నేడుతో మారిన రూపురేఖలు
- సకల సదుపాయాలతో కళకళ
- బహుసుందరంగా మారిన ప్రభుత్వ బడులు



కార్పొరేట్ స్కూల్‌ను తలదన్నేలా రూపుదిద్దుకున్న ప్రభుత్వ పాఠశాల

చల్లదనాన్ని పంచే బడి.. ఆనందం, ఆహ్లాదం, వినోదం, విజ్ఞానం అందిస్తూ సకల సదుపాయాలతో కళకళలాడుతున్న సర్కారు బడి ఇదే. ఇక్కడ పాఠ్యపుస్తకాలు, భోజనం, బూట్లు, యూనిఫాం దుస్తులు, టై, బ్యాగ్ తదితరాలన్నీ ఉచితమే. ఏడాదిలో మూడు సార్లు వైద్య పరీక్షలు, నేత్ర పరీక్షలు పాఠశాలలోనే ఉచితంగా చేస్తారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు చక్కని రీతిలో బోధిస్తారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బోధన మరో విశేషం. ఈ బడిలో కూర్చుంటే అమ్మఒడిలో సేద తీరిన అనుభూతి కలుగుతుంది.

ఐరాల: గ్రామాల్లో పేదల తలరాతలు మార్చేది చదువు మాత్రమే అన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. నాడు–నేడు పేరుతో సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు. పేద విద్యార్థులందరికీ మెరుగైన వసతులతో నాణ్యమైన విద్య అందించేందుకు శ్రీకారం చుట్టారు. ధనికులకు మాత్రమే అందుబాటులో ఉండే కార్పొరేట్ స్కూళ్ల స్థాయిలో సౌకర్యాలు కల్పించి ఇంగ్లిష్ మీడియం చదువులను పేదలకు చేరువ చేశారు.

ఫేజ్–1లో రూ.4.55 కోట్లు

మండలంలో 7 జెడ్పీ హైస్కూళ్లు, 4 ప్రాథమికోన్నత, 54 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వాటిలో ఫేజ్–1 కింద 23 పాఠశాలలను ఎంపిక చేసి రూ.4.55 కోట్ల అంచనాలతో మౌళిక వసతులు కల్పించారు. విద్యార్థులు కూర్చోవడానికి డెస్కులు, గ్రీన్ బోర్డులు, ప్రతి తరగతి గదిలో ఐదు చొప్పున ఫ్యాన్లు, వెలుతురు కోసం నాలుగు వైపులా ట్యూబ్ లైట్లు, ఇలా విద్యార్థులకు తరగతి గదిలో అవసరమైన అన్ని సదుపాయాలతో పాటు ప్రత్యేకంగా మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టారు. వాటిన్నింటినీ పూర్తి చేశారు. పనుల్లో ఎలాంటి అవినీతికి తావు లేకుండా పాఠశాలల కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయుడు కలిసి పనులు చేసేలా నిర్ణయం తీసుకున్నారు.

ఫేజ్–2లో రూ.3.55 కోట్లు

మండలంలో ఫేజ్–2లో 21 పాఠశాలలను ఎంపిక చేసి రూ.3.55 కోట్లు నిధులు విడుదల చేశారు. ఈ పాఠశాలల పనులు పూర్తి కావస్తున్నాయి. కార్పొరేట్ స్థాయిని తలదన్నే విధంగా పాఠశాలలను తీర్చిదిద్దడంతో పాటు కార్పొరేట్ తరహాలో ఇంగ్లిష్ మీడియంలో తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో పలువురు విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల వైపు చూస్తున్నారు.

పెరిగిన విద్యార్థుల సంఖ్య

టీడీపీ ప్రభుత్వంలో సర్కారు బడులను నిర్లక్ష్యం చేయడంతో వెలవెలబోయాయి. కనీస వసతులు లేక విద్యాప్రమాణాలు పడిపోయి విద్యార్థుల సంఖ్య పడిపోయింది. 2019కి ముందు మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1,700 మంది విద్యార్థులుండగా, 2022–23 విద్యా సంవత్సరానికి ఆ సంఖ్య 3,266కు చేరింది. ఈ విద్యా సంవత్సరంలో కాణిపాకం జెడ్పీ హైస్కూల్లో నూతనంగా 566 మంది విద్యార్థులు చేరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇంగ్లిష్ మీడియం విద్య అమలు చేయడంతో పాటు పాఠశాలల్లో వసతులు మెరుగుపరచడంతో అధిక సంఖ్యలో విద్యార్థినులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ఈ క్రమంలో కాణిపాకం జెడ్పీ హైస్కూల్‌కు బాలికల జూనియర్ కళాశాలను కూడా మంజూరు చేశారు. దీంతో అధిక సంఖ్యలో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు.

రూపాయి ఖర్చులేదు



నేను టైలరింగ్ షాపులో పని చేస్తాను. నా కుమారుడు, కుమార్తె స్థానిక ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. స్కూల్ తెరిచిన మొదటి రోజునే పుస్తకాలు, బూట్లు, సాక్సులు, బెల్టు వంటివి ఇచ్చారు. ఏటా విద్యార్థుల తల్లిదండ్రులు రూ.వేలు ఖర్చు చేసి వాటిని కొనుగోలు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు మాకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వమే వాటిని ఉచితంగా అందించడం ఆనందంగా ఉంది.

- ప్రియాంక, మొరంపల్లె, ఐరాల

ఆనందంగా ఉంది



పాఠశాల గతంలో కంటే ఇప్పుడు ఎంతో బాగుంది. నాడు–నేడు ద్వారా మా పాఠశాలలో అనేక మౌళిక సౌకర్యాలు కల్పించారు. ప్రస్తుతం పాఠశాలలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం, వాటిని పరిశుభ్రంగా ఉంచడానికి మహిళలను ఏర్పాటు చేయడంతో బాలికలు చాలా ఆనంద పడుతున్నారు. రెండో దశలో భాగంగా అదనంగా తరగతి గదులు నిర్మిస్తున్నారు. పాఠశాల అభివృద్ధితో ఆనందంగా ఉంది.

- జాహ్నవి, 8వ తరగతి, ఐరాల

జేవీకే కిట్ బాగుంది



పాఠశాల తొలి రోజునే మాకు పుస్తకాలు అందించారు. జగనన్న విద్యా కానుకలో భాగంగా పుస్తకాలు, బెల్టు, బ్యాగు, షూ, నోట్ బుక్‌లు ఉచితంగా అందించడం ఆనందంగా ఉంది. జగన్ మామా అందిస్తున్న ఈ కిట్ ద్వారా మా తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గుతోంది. ఇప్పుడు మా స్కూల్ రూపురేఖలు మారిపోయాయి. ఇప్పుడు స్కూల్ చాలా అందంగా, పరిశుభ్రంగా ఉంది. బడికి రావాలంటే ఎంతో ఉత్సాహంగా ఉంది.

- ముజీబ్, 10వ తరగతి, ఐరాల

ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ



ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అందరూ ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నారు. దానికి తోడు ప్రభుత్వం తీసుకున్న నాడు–నేడు, ఇతర నిర్ణయాలు మెరుగైన ఫలితాలు అందిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ విద్యా విధానంలో సంస్కరణలు చేపట్టడం అభినందనీయం. ఈ ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ముందుకు వెళుతోంది.

- వేణుగోపాల్‌రెడ్డి, ఎంఈఓ, ఐరాల

నగరవనం నిర్మాణాలకు అనుమతి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని రెండు ప్రాంతాల్లో నగరవనం నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. కుప్పం, కార్వేటినగరం ప్రాంతాల్లో నగరవనం నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కొక్క వనం రూ.1.40 కోట్లతో నిర్మించాలని ఉత్తర్వులు అందాయని వివరించారు.

కుష్ఠు వ్యాధిని నిర్మూలించాలి

యాదమరి: కుష్ఠువ్యాధిని సమూలంగా నిర్మూలించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్ కుమార్ నాయక్ అన్నారు. సంతగేటులోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆశావర్కర్లకు, ఆరోగ్య కేంద్ర సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుష్ఠువ్యాధి నిర్మూలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి జూలై 16 వరకు సర్వే చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. మండలంలోని ఆశావర్కర్లు, వైద్యశాఖ సిబ్బంది కలిసి గ్రామాల్లో సర్వే నిర్వహించాలన్నారు. గ్రామంలో కచ్చితంగా ప్రతి గృహాన్ని సందర్శించాలని సూచించారు. కుష్ఠువ్యాధి లక్షణాలు ఉన్నట్లైతే వారిని గుర్తించి ఆరోగ్యకేంద్రానికి తీసుకురావాలని తెలిపారు. వారికి మందులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

బంగారుపాళెం ఎస్‌ఐగా రాంభూపాల్



బంగారుపాళెం: స్థానిక పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా శుక్రవారం రాంభూపాల్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న మల్లికార్జున్‌రెడ్డి రెండు నెలల క్రితం అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లెకు బదిలీ అయ్యారు. వీఆర్‌లో ఉన్న రామ్‌భూపాల్ బంగారుపాళెం ఎస్‌ఐగా విధులు చేపట్టారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

చిత్తూరు అర్బన్: టిడ్కో గృహ సముదాయాల వద్ద జరుగుతున్న పనులు గడువులోగా పూర్తి చేయాలని కమిషనర్ అరుణ కాంట్రాక్టర్లను ఆదేశించారు. నగర పరిధిలో పూనేపల్లి వద్దనున్న టిడ్కో గృహ సముదాయాల్లో జరుగుతున్న పనులను శుక్రవారం సాయంత్రం కమిషనర్ పరిశీలించారు. పెయింటింగ్ పనులను పరిశీలించి పనుల్లో నాణ్యత ఉండాలని సూచించారు. రోడ్డు పనులను పరిశీలించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కాలువల నిర్మాణం జరుగుతున్న తీరు, సీవేజ్ పైప్ లైన్ల నిర్మాణ పనులను తనిఖీ చేశారు. జరుగుతున్న పనులన్నింటినీ 15 రోజుల్లో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వేగవంతం చేయాలని టిడ్కో అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టిడ్కో ఈఈ వెంకట ముని, ఎంఈ వెంకట ప్రసాద్, డీఈ రమణ, సీఎంఎం గోపి, టిడ్కో ధనుంజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సురక్షను పకడ్బందీగా నిర్వహించాలి



సీఎం సందేశాన్ని వీక్షిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చిత్తూరు రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జెడ్పీటీసీ సభ్యుడు బాబునాయుడు, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి ఆదేశించారు. నగరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం అధికారులు, ప్రజాప్రతినిధులు సీఎం సందేశాన్ని వీక్షించారు. తర్వాత వారు మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు, సంక్షేమ కార్యక్రమాలను పక్కాగా అమలు కావాలని, అర్హులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోందన్నారు. అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా చూడాలని వారు పేర్కొన్నారు. ఆర్‌ఐ ధనంజయ్య, వైస్ ఎంపీపీ జయరాం, ఎంపీటీసీ ప్రతిమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కుంభాభిషేకం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం చర్చివీధిలోని కృష్ణ విలాస సభ కుంభాభిషేక పూజలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్ఛారణలు, అశేష భక్తుల నడుమ పుణ్యాహవాచనం రక్షబంధనం, హోమపూజలను భక్తిశ్రద్ధలతో జరిపించారు. తరువాత రుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ధర్మకర్త బుల్లెట్ సురేష్, నిర్వాహకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పక్కాగా 'జగనన్న సరక్ష'

గుడిపాల: జగనన్న సురక్ష పక్కాగా చేపట్టాలని ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఆయా సచివాలయాల పరిధిలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలు ప్రభుత్వ పథకాలు పొందేందుకు కావాల్సిన సర్టిఫికెట్ల వివరాలు తీసుకోవాలన్నారు. కుల, ఆదాయ, జనన, మరణ, కుటుంబ ధృవీకరణ పత్రాలు, రేషన్‌కార్డులు తదితర 11 రకాల సర్టిఫికెట్లు త్వరితగతిన పంపిణీ చేసే ప్రక్రియను శనివారం నుంచి చేపడతామన్నారు.

ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

గుడిపాల: టైంపాస్‌కు మాత్రం ఉద్యోగాలు చేయకండి బాధ్యతగా పనిచేయండి అంటూ జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు సిబ్బందికి హెచ్చరికలు జారీ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులతో గృహ నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. మండలంలో ఉన్న 27 పంచాయతీలకు సంబంధించి గృహ నిర్మాణాలు పెండింగ్‌లో ఉండడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి రూ.35వేలు కూడా అదనంగా ఇవ్వనున్నందున ఇకపై వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. తానే స్వయంగా ఇంటి నిర్మాణాల వద్దకు వస్తానని లబ్ధిదారులతో మాట్లాడి తెలుసుకుంటానన్నారు. నిబద్ధతతో పనిచేస్తే అన్ని పనులను సకాలంలో పూర్తి చేయవచ్చన్నారు. జగనన్న కాలనీల్లో కొన్ని కోర్టు కేసులు ఉన్నాయని వాటి వల్ల అక్కడ పనులను ఆపేసినట్లు ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు జేసీ దృష్టికి తీసుకువచ్చారు. కోర్టుల్లో ఉండే వాటిని పక్కన పెట్టి మిగతా వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. అసలు ఇంటి నిర్మాణాలు మొదలెట్టని వారికి నోటీసులు అందించి ఇంటి పట్టాలను రద్దు చేయాలని తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ పద్మనాభం, ఎంపీడీవో రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి

గుడిపాల: గ్రామ సచివాలయం, రైతు భరోసా, విలేజ్ హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీలకు సంబంధించి భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం భవన నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ కాంట్రాక్టర్ల ఖాతాలోకి జమ చేసినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలను సెప్టెంబర్ 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎక్కడ గానీ రాజీలో నాణ్యత లోపించకూడదన్నారు. అక్టోబర్ 1వ తేదీకి భవన నిర్మాణాలను పూర్తిచేసి తమ చేతికి అందజేయాలని చెప్పారు.

జ్వరాల నియంత్రణకు చర్యలు





చెరువులో చేపలు వదులుతున్న కమిషనర్ అరుణ, మొక్క నాటుతున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: నగరంలో డెంగ్యూ జ్వరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు నగర కమిషనర్ అరుణ చెప్పారు. కమిషనర్ నగరంలోని శుక్రవారం ఉదయం 8వ వార్డు పరిధిలోని కుమార్ నగర్ కాలనీలో జిల్లా మలేరియా అధికారులతో కలిసి పర్యటించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాల తీరును తనిఖీ చేశారు. నివాస గృహాలను సందర్శించి లార్వాలను గుర్తించారు. దోమల వల్ల కలిగే వ్యాధులు, నియంత్రణపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతివారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం కట్టమంచి, దుర్గా నగర్ కాలనీ, గంగినేని చెరువులో దోమ లార్వాల నియంత్రణకు గంబూజియా చేప పిల్లలను వదిలారు. మేజర్, మైనర్ డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయిస్తున్నామని, స్ప్రేయింగ్ విస్తృతంగా చేయించడం ద్వారా ఈ ఏడాది డెంగ్యూ జ్వరాలను గణనీయంగా తగ్గించేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సన్నిషర్మిల, జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు, సబ్ యూనిట్ అధికారి పీరూ సాహెబ్, ఎంహెచ్వో లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పక్కాగా ఏర్పాట్లు

నగరంలో సీఎం పర్యటన నేపథ్యంలో పారిశుధ్యం, రోడ్ల మరమ్మతులు పక్కాగా చేపట్టాలని నగర కమిషనర్ అరుణ నగరపాలక అధికారులను ఆదేశించారు. కమిషనర్ శుక్రవారం ఉదయం నగరంలో విస్తృతంగా పర్యటించారు. సీఎం పర్యటించనున్న విజయ డెయిరీ ప్రాంగణాన్ని కమిషనర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కమిషనర్ కలెక్టర్ బంగ్లా రోడ్డులో ఇరువైపులా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈ వెంకట ప్రసాద్, ఎంహెచ్వో డా లోకేష్, డీఈ రమణ, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు
- పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు



పుణ్యసముద్రంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు

తవణంపల్లె: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన అధికారులతో కలసి మండలంలోని పుణ్యసముద్రం, ఎల్ ఎస్ పురం, సంతపల్లె గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికి ప్రభుత్వ పథకాల అందుతున్న తీరుపై ఆరాతీశారు. ప్రభుత్వ పథకాలు ఇంటింటికి అందాలంటే జగనన్నను మరో సారి సీఎం చేయాలని ఎమ్మెల్యే చెప్పారు. గ్రామాల్లో ప్రజలు రోడ్లు బాగు చేయాలని, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని, ఇంటి పట్టాలు, రేషన్‌కార్డు మంజూరు చేయాలని, సిమెంటు రోడ్లు నిర్మించాలని పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పుణ్యసముద్రంలో డ్రైనేజీ కాలువ నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఈశ్వర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్‌కలామ్‌ఆజాద్, తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, అధికారులు, మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, మండల కన్వీనర్ సి.హరిరెడ్డి, ఎంపీటీసీ డేవిడ్, సర్పంచ్ ఎంకె జయసుధ, వైఎస్సార్‌సీపీ నాయకులు గాంధీబాబు, రమణారెడ్డి, మధుకుమార్, వేణుగోపాల్, రవిప్రసాద్, వరప్రసాద్‌రెడ్డి, కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు మారేడుపల్లె పంచాయతీలో..

మండలంలోని ఎగువ మారేడుపల్లె పంచాయతీలోని గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, ఎంపీపీ గీతారెడ్డి తెలిపారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందని వివరించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.